నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 47



# కథానికకు క్లుప్తతే ప్రాణం

**- విహారి**

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి అంటే ఎవరో తెలియదేమో కానీ, 'విహారి' అంటే మాత్రం రచయితలందరికీ సుపరిచితం. పది కథా సంకలనాలు వెలువరించిన వీరు కథకుడిగా ఎంత ప్రసిద్ధులో, 'తెలుగు కథ తేజోరేఖలు', 'కథావిహారం','పరిచయాలు పరామర్శలు' శీర్షికల ద్వారా విమర్శకుడిగా కూడా అంతే ప్రసిద్ధులు. ఏడుపదుల వయసులో కూడా ఏడాదికి రెండు పదుల కథలు రాస్తూ కథా విహారం చేస్తున్న విహారి గారితో ఇంటర్వ్యూ ఈ వారం..

### మా నాన్నగారు చాలా నిజాయితీ గల మనిషి

మాది తెనాలి. జొన్నలగడ్డ మేధా దక్షిణామూర్తి, శ్రీదేవి మా అమ్మా నాన్నలు. మేం ఏడుగురు సంతానం. ఇద్దరు మగపిల్లలం, ఐదుగురు ఆడ పిల్లలు. నేను 15 అక్టోబర్ 1941న పుట్టాను. మానాన్నగారు 'బర్మాషెల్' కంపెనీలో పని చేసేవారు. అప్పట్లో అది చాలా పెద్ద కంపెనీ. నాన్న చాలా నిజాయితీ మనిషి. మాటంటే పడేవారు కాదు. అందువలన చిన్న మాట పట్టింపుకోసం అందులో ఉద్యోగాన్ని వదిలేశారు. తను అష్టకష్టాలు పడ్డమే కాకుండా కుటుంబాన్నీ కష్టాల పాల్జేశారు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా, ఆర్థిక కారణాల దృష్ట్యా నా బాల్యమంతా కష్టాల్లోనే గడిచింది. చదువు కూడా అంతే! ఎస్.ఎస్.ఎల్.సితో నా చదువు ఆగిపోయింది. తర్వాత సంపాదించిన డిగ్రీలన్నీ నా స్వశక్తితో సంపాదించుకున్నవే! పేదరికం లోతుల్నీ, నిరాదరణ అంచుల్ని అనుభవించినవాణ్ణి.

### గోపీచంద్ ప్రభావం ఎక్కువ


నాకు మొదట బందర్లో ఉద్యోగం. అప్పటికే మచిలీపట్నంలో సాహిత్య వాతావరణం చాలా ముమ్మరంగా, ఆహ్లాదకరంగా ఉంది. ఆదివిష్ణు, రామ చంద్రమూర్తి, హవిస్సు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య వంటి వారంతా కథల పంట పండిస్తున్నారు. నాలో సాహిత్య పిపాస కలగడానికి అది ఒక కారణం అయితే, 1955-60ల మధ్యలో పుస్తకాల పురుగులా సాహిత్య అధ్యయనం చేయడం మరో కారణం. అందునా గోపీచంద్ ప్రభావం నాపైన ఎక్కువ. మధు రాంతకం రాజారాంగారి కథలు నాలో కథాస్ఫూర్తిని రగిలించాయి. 1962లో 'చుక్కాని' అనే పక్షపత్రికలో నా మొదటి కథ 'రాగజ్యోతి' అచ్చయింది.


### 'ఆంధ్రపత్రిక'లో వరుసగా బహుమతులొచ్చాయి

జిల్లా పరిషత్‌లో కొంతకాలం టెంపరరీగా పనిచేశాను. తర్వాత 1961లో ఎల్ఐసిలో అసిస్టెంట్‌గా చేరాను. 2001లో అందులోనే జనరల్ మేనేజర్ అయ్యాను. 2002లో రిటైర్ అయ్యాను. నా సహోద్యోగి శాలివాహనతో కలిసి రచనా వ్యాసంగం ప్రారంభించాను. నేను ఎల్ఐసిలో చేరింది మొదలు 1977 వరకు ఇద్దరం కలిసి కథలు రాశాం. తర్వాత ఉద్యోగంలో బదిలీల కారణంగా దేశంలోని పలు ప్రదేశాలకు పోవాల్సి వచ్చింది. దీంతో 1977 నుంచి మేం ఇద్దరం కలిసి రాయడం లేదు. అయినా నేను రాయడం ఆపలేదు. 1981 నుంచి వరుసగా ఐదు సంవత్సరాలు 'ఆంధ్రపత్రిక'లో నిర్వహించిన దీపావళి కథల పోటీలో నాకు బహుమతులు లభించాయి.

### రోజూ భాగవతంలోని పద్యాలు చదివేవాడిని

నాకు బాల్యం నుంచీ పద్యకవిత్వమంటే ఇష్టం. భాగవతంలోని 'షష్ఠ్యంత్య' పద్యాలు రోజూ చదివేవాడిని. అందులో 'హరికి నంద గోకుల విహారికి..' అని చదువుతోంటే 'విహారి' అనే పదం ఎందుకో, బాగుంటుంది అనిపించింది. దాన్నే నా కలం పేరుగా పెట్టుకున్నాను. నా అసలు పేరు జొన్న లగడ్డ సత్యనారాయణమూర్తి.


భార్య శ్యామలాదేవితో...


దాశరథి తదితరులతో...

### కథానికకు క్లుప్తతే ప్రాణం

కథానికకు క్లుప్తతే ప్రాణమని నమ్ముతాను. మనిషి జీవితంలోని ఒక పార్శ్వాన్నో, ఒక కోణాన్నో లేదా ఒక సంఘటననో, మానసిక స్థితినో, అంతరం గాన్నో మాత్రమే కథానిక చిత్రించాలి. మొత్తం జీవితం సమాజపు రొద నేప థ్యంగా ధ్వనించాలి. అలాంటి కథలే బాగుంటాయి. కథానికకి వస్తు రూపాలు రెండూ ముఖ్యమని నమ్ముతున్నాను.

### బాధితుల పట్ల చమర్చే కన్ను కలిగి ఉండాలి

'మనిషి వైరుధ్యాల పుట్ట. ఇది కావాలని ఆరాటపడి, అది రాలేదని కుళ్ళి పోయి ప్రయోజనం లేదు. జీవితం నీకు ఎప్పుడు ఏది ఇస్తుందో దాన్ని అందుకో. బాధితుల పట్ల చమర్చేకన్నుని కలిగివుండు' ఇదీ నా తత్వం. నా చాలా కథల్లో అంతర్లీనంగా ఈ జీవన తాత్వికత ధ్వనిస్తూనే వుంటుంది.

### నవతరం చేతుల్లో కథ ప్రకాశిస్తోంది

నూరేళ్ళ తెలుగు కథానికకి 'నవ్య'లాంటి పత్రికలూ, వేదగిరి రాంబాబు వంటి వ్యక్తులు ఎంతో ఆరాధనా భావంతో ఉత్సాహ ప్రోత్సాహాలిస్తున్నారు. కథానిక భవిష్యత్తు మీద అచంచలమైన విశ్వాసం ఉంది నాకు. నవతరం, యువతరం కథకుల చేతుల్లో అది ఉజ్వలంగా ప్రకాశిస్తున్నది, ప్రకాశిస్తుంది.

### మాండలికం జాతి జీవనాడి

మాండలికం సొగసు కథానికలోకి రావాలని ఆశించే వాళ్ళలో నేనూ ఒకణ్ణి. అది జాతి జీవనాడి. అయితే కథనం అంతా మాండలికమే అయినప్పుడు, చది వించే గుణం మీద రచయిత ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సి వుంటుంది.

### వేతన జీవుల అష్టకష్టాలే నా ఇతివృత్తాలు

మధ్య తరగతి వేతన జీవుల 'అష్టకష్టాలు' నా కథల ఇతివృత్తాలు. వారి ఈనాటి చావుబతుకులు నా కథానికలకి వస్తువు. ఈ సమాజం యింతకంటే బాగుంటే మనిషి బతుకు బాగుపడుతుంది గదా అనే సంవే దన గల రచయితనే నేను కూడా.

### బహుశా మొదట నేనే రాశాననుకుంటా!

కథానిక చదివే పఠితకి ఏ వాద వివాదాల ట్యాగ్‌లు అక్కర్లేదు. అది విమర్శకుల వింగడింపుకు మాత్రమే ఉపయోగపడుతుంది. 'తెలుగు కథ తేజోరేఖలు', 'కథా విహారం', 'పరిచయాలు పరామర్శలు' వంటి శీర్షికలు నిర్వహించాను. వీటి ద్వారా మంచి కథల్ని పాఠకుల దృష్టికి తీసుకు వచ్చి, కథకులకి స్ఫూర్తి దాయకంగా కథా విశ్లేషణ చేస్తూ, అభినందించటం మాత్రమే ముఖ్యోద్దేశంగా సాగిన వ్యాస పరంపర బహుశా తెలుగులో మొట్టమొదటిసారి నేనే రాశాను. రాస్తున్నాను. 94మంది సమకాలీన రచ యితల కథా విశ్లేషణతో, 'కథాకృతి' మొదటి సంపుటం నిన్న మొన్ననే ప్రచురించబడింది.

## నచ్చినవి

| | |
|---|---|
| **కథ :** చావు పుట్టుక (శ్రీశ్రీ) | **గాయకుడు :** ఘంటసాల |
| **కథకుడు :** గోపీచంద్ | **సినిమా :** మాయాబజార్ |
| **నవల :** అసమర్థుని జీవయాత్ర | **నటి :** సావిత్రి |
| **కవి :** సినారె | **నటుడు :** కమలహాసన్ |
| **పాట :** పిబరే రామరసం (పడమటి సంధ్యారాగం) | **వ్యక్తి :** స్వర్గీయ బి.సీతారామయ్య గారు |
| **గాయని :** పి.లీల | **వంట :** ఏ స్వీట్ అయినా సరే! |

### ఏ కాలంలో అయినా తాలూతప్పా ఉంటాయి

కథానికల్లో ఏ కాలంలో అయినా కొంత తాలూతప్పా ఉంటుంది. దాన్ని వదిలేసి చూస్తే వర్తమానంలో వస్తున్న వాటిలో చాలా మంచి కథలుంటున్నాయి. కొన్ని గొప్ప కథలు కూడా ఉంటున్నాయి. వీటిని చదివే తీరిక ఓపిక లేని కొందరు పెద్దలు మాత్రం ఈనాటి కథల గురించి పెదవి విరుస్తున్నారేమో కానీ, అత్యధిక కథల్ని చదివే వారు ఈ వాస్తవాన్ని గమనిస్తూనే ఉన్నారని నా భావన.

### మా ఆవిడ కూడా కథలు రాసింది

1962లో శ్యామలాదేవితో నాకు వివాహం అయింది. మాకు ముగ్గురు పిల్లలు. అందరూ స్థిరపడ్డారు. మా ఇంట్లో అందరికీ సాహిత్యం పట్ల అభిరుచీ, అభినివేశం ఉన్నాయి. నా శ్రీమతి కూడా మంచి కథా రచయిత్రి. పాతికకు పైగా కథలు రాసి ఉంటుంది. నా కథలకు ఆవిడే ప్రథమ పాఠకురాలు. పిల్లలు పుట్టడం, అనారోగ్యం, ఇతర కారణాలతో తను రాయడం మానేసింది.

### జీవితంలో ఇదొక తృప్తి

నా జీవితంలో మా నాన్న మరణం బాధాకరమయింది. అప్పుడు దుర్భర దారిద్ర్యం అనుభవించాం. అప్పటికింకా మేము జీవితంలో సిర్థపడలేదు. మా నాన్నగారు పోయింతర్వాత, కుటుంబ బాధ్యతల్ని నేనే నిర్వర్తించాను. అలాంటి కష్ట పరిస్థితుల్లో సైతం శక్తి మేరకు నా స్థితిలో వున్న యితరులకు తోడ్పడ్డాను. జీవితంలో ఇదొక తృప్తి.

### చాలా ఆనందం కలిగించాయి

ఉద్యోగంలో ఆఫీసర్ కావడం, కథలకి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం రావడం, యూనివర్శిటీ ర్యాంక్‌తో ఎం.ఏ. పట్టభద్రుణ్ణి కావడం, ఐదు సంవత్సరాలు వరుసగా ఆంధ్రపత్రిక కథల పోటీలో బహుమతులు రావటం ఇవన్నీ ఒకే వరుసలో జరగటం చాలా ఆనందం కలిగించిన విషయాలు.

### అవగాహనా రాహిత్యంతో కథలు రాయరాదు

మూస ఇతివృత్తాలనుంచి బయటపడాలి. 'ప్రపంచీకరణ' వంటి 'పడికట్టు' పదాల్ని విని, చూసి అవగాహనా రాహిత్యంతో కథావస్తువులు అల్లటం పరిహరించుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. నేను 2007లో 22 కథలు, 2008లో 22 కథలు, 2009లో 20 కథలు రాశాను. వీటితో పాటు ఈ మూడేళ్లలో శీర్షికలు నిర్వహించడమే కాకుండా సుమారు 60 వ్యాసాలు రాశాను. నిరంతర అధ్యయనం, రాయాలనే తపన ఈ రెంటి వలనే నేను చేస్తున్న కృషి సాధ్యమవుతోంది. 'రామాయణం' పద్యకావ్యం రాస్తున్నాను. రెండువేల పద్యాలు రాశాను. ఇప్పటికే బాల, సుందర కాండలు అచ్చయ్యాయి.

### కేవలం ఆత్మతృప్తి కోసమే రాస్తున్నాను

రామాయణం రాయడానికి ప్రముఖ కారణం ఒకటుంది. రాముడు మానవుడుగా ఒక మనిషి సమాజ హితం కోసం పాటించవలసిన సూత్రాలు తన మనోవాక్కాయ కర్మల ద్వారా లోకానికి అందించాడు..ఆ భావజాలం ఈనాటి మనుషులకు కూడా అవసరం అనే అభిప్రాయంతో రామాయణ రచన చేశాను.

రామాయణం అంతటి మహత్తరమైన ఇతిహాసం లేదా కావ్యం పద్యాల్లోనే రచింపబడటం ఒక ఔన్నత్యాన్ని ఔచిత్యాన్ని సంతరించుకుంటుందని పద్యాల్లోనే రాశాను. మరో కారణం కేవలం ఆత్మతృప్తి. పద్యాల మీద నాకున్న పట్టు కావచ్చు. రామాయణం పద్య కావ్యంగా రాయడం అనేది కేవలం ఆత్మసంతృప్తి మాత్రమే!

**-సుంకోజి దేవేంద్రాచారి**


**FORM IV**
(Rule 8)

UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS
ABOUT WEEKLY - NAVYA

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of its Publication | : | WEEKLY |
| 3. Printer's name | : | VEMURI RADHA KRISHNA |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin] | : | - |
| Address | : | Plot No.204, Road No. 76, III Phase, Jubilee Hills, Hyderabad - 500033 Andhra Pradesh |
| 4. Publisher's Name | : | VEMURI RADHA KRISHNA |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin] | : | - |
| Address | : | Plot No. 204, Road No. 76, III Phase, Jubilee Hills, Hyderabad - 500033 Andhra Pradesh |
| 5. Editor's Name | : | A.N. JAGANNADHA SARMA |
| Nationality | : | INDIAN |
| 1(a) Whether a citizen of India | : | YES |
| (b) If a foreigner, the country of origin] | : | - |
| Address | : | Plot No.183, Flat No.502, Kakatiya Residency, Moti Nagar, Hyderabad - 500018 |
| 6. Name and addresses of inividuals Who own the newspaper and partners Shareholders holding more than one percent of the total capital | : | (a) Aamoda Publication Pvt.Ltd Plot No.76, Road No.70, Ashwini Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad - 500033 |
| | | (b) V.Radha Krishna Plot No. 204. Road No.76 III Phase, Jubilee Hills Hyderabad - 500033 |
| | | (c) K.Kanaka Durga Plot No. 204. Road No.76 III Phase, Jubilee Hills Hyderabad - 500033 |
| | | (d) M. Prabhakara Rao Flat No. 103, Ruby Apartments, Lumbini Rock Dale, Somajiguda, Hyderabad - 500082. |
| | | (e) D. Jai Ramesh Plot No. 173, Road No. 13, Jubilee Hills, Hyderabad - 500033. |

I, VEMURI RADHAKRISHNA, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/
VEMURI RADHAKRISHNA
Publisher

Date: 28.02.2010

## నాకు నచ్చిన నా కథ

# స్పృహ

**- విహారి**

**రమ్మీలో కూర్చుంటే అన్ని ఆటల్లోనూ పన్నెండు ముక్కలే పండుతయ్. ఎక్స్‌టెన్షన్ అంది చావదు.**

**బ్రిడ్జి ఆడుతుంటే ''అపోనెంట్స్''కి గ్రాండ్ శ్లామ్‌లు పడతయ్, నా చేతిలో పాయింటే వుండదు.**

**సినిమా టిక్కెట్ల క్యూలో నిలుచుంటే నా దగ్గరి కొచ్చేసరికి బుక్కింగ్ కౌంటర్‌ని కట్టేస్తాడు.**

**అంతా తరుగు.**

**అన్నింట్లోనూ తరుగు.**

**జీవితంలో వెలితి.**

**జీవితం నాతో క్షణక్షణానికి దోబూచులాడుకుంటుంది, అడుగడుక్కీ దాన్ని నేను పట్టుకుందామనుకుంటే, అది నన్ను మొట్టి పరిగెత్తుకుపోతుంది.**

**''అసలు నువ్వు పుట్టడమే అలా పుట్టేవు. ఏడో నెలలోనే ఏదో కొంప మునిగినట్టు నా ప్రాణం తీసి ఈ లోకంలోకి తన్నుకొచ్చావు''. అమ్మ నన్ను శపిస్తున్నట్టుంటుంది. ఆమె రూపం నాకు తెలీదు. ఆమె చావబోయే ముందు మాత్రం ఖచ్చితంగా ఇలా అనుకుని వుంటుందని అనిపిస్తూ వుంటుంది నాకు.**

''అసలు నీ తరుగంతా నీ కుడికాల్లోనే వుంది. కుడి ఎడమలకి అరంగుళం వ్యత్యాసం చాలు – కురచదనం కనిపించటానికి'' సత్యం అనేది అక్షరాలా నిజం.

''ఆ అవలక్షణం సంగతి సరే – చూపుడువేలుని బొటన వేలుకంటే అంత తక్కువగా ఎందుకు అతికించాలోయ్ – బెమ్మదేవుడు.... అది మాత్రం తరుగు కాదూ?'' రాజు ప్రశ్నలాంటి సందేహం, సందేహంలాంటి ఎద్దేవా.

ఎస్సెల్సీలో ఒక మార్కు.... తక్కువతో ''స్కూల్ ఫస్ట్'' పోయింది. 1905 నుంచీ వేలాడ దీసిన బోర్డు మీద రమాకాంతం పేరు రాసి నన్ను కుళ్ళి పొమ్మన్నారు. వాడిప్పుడు నైవేలీలో ఇంజనీరు.

బియ్యేలో ఆరు వందలకి మూడు వందల యాభై తొమ్మిది మార్కులిచ్చి ఏడవ మన్నారు. ఫస్టు క్లాస్ అంటే తంతామని హెచ్చరికన్న మాట!

ఓ కంపెనీలో ఆఫీసర్ ఉద్యోగానికి ఐ.ఎ.ఎస్.కి దీటైన పోటీపరీక్ష రాస్తే నేను పదో వాడిగా వచ్చాను. ఇంటర్వ్యూలో నెగ్గిన తర్వాత నా నెంబరు ఇరవై ఒకటికి దిగజారింది. ఏడాది గడిచినా అపాయింట్‌మెంట్ ఆర్డర్ రాదు. బొంబాయి పోయి కనుక్కుంటే ఇరవై మందిని తీసుకుని లిస్టుని ''స్క్రాప్'' చేశామన్నారు.

గుమాస్తా ఉద్యోగానికీ, టైపిస్టు ఉద్యోగానికి కలిపి వున్న పరీక్ష రాస్తే టైపిస్టుగా ''సెలక్టు'' చేశారు. వెయిటింగ్ లిస్టులో వుంది నా పేరు. ఉద్యోగంలో చేరాల్సిన వాళ్ళలో ఒకతను హఠాత్తుగా పాము కరిచి పోయాట్ట. నాకిచ్చారు.

''తరుగులో మెరుగంటే యిదే. ఇకనుంచీ నీ జాతకం మారుతుందిలే'' సత్యం ఆశాజీవి. నన్ను అభినందించాడు.

ఆఫీసులో అందరికీ గాడ్రేజ్ టేబుల్స్ కుర్చీలు. నే వెళ్ళేసరికి ''కేపిటల్ బడ్జెట్'' అయి పోయింది. 'ఇక్కడ కూర్చో' అన్నారు. మాంధాతల నాటి కొయ్య టేబులూ, కొయ్యకుర్చీ లభించినై. 1965లో కొన్న ''అండర్ వుడ్'' టైప్ రైటర్ యిచ్చారు. జూనియర్ మోస్టుని మరి.

నాకు నలుగురు మావయ్యలు. వాళ్ళకి పన్నెండుమంది ఆడపిల్లలు. అందులో ''అయిదుగురు నాకు ఈడూ జోడూ కుదిరిన వాళ్ళు. పెద్ద మావయ్య మూడో కూతురు సావిత్రి నా భార్యయితే బాగుణ్ణు'' అని నా గుండె చప్పుడు చేస్తూ వుండేది. సావిత్రికి సంబంధం ఖాయమైంది. ఆవిడ డాక్టరు గారి భార్య యిప్పుడు. కోడి మెడని నొక్కి పట్టినట్లయింది. నా కోరికని నొక్కేసుకున్నాను.

ఇరవై ఏళ్లు నన్ను పెంచిన పెద్దమామయ్య రమని చేసుకో అన్నాడు. ఆమె ఆయన నాలుగో కూతురు! నేను తల వూపకపోయినా నా పెళ్ళి జరిగే పోయింది.

సరదాగా సాయంకాలాలు సతీమణితో షికారుకువెళ్ళి వస్తూ..... వస్తూ.... అలా ఓ మల్లెపూలదండ కొనుక్కుని రావాలని వుండేది. నాకు – పెళ్ళయిన కొత్తల్లో, ''నే చదువుకోవాలండీ, పరీక్షలొస్తున్నై, ఇలా షికార్లు చేస్తుంటే ఏ వొక్క మార్కులోనో తప్పి కూర్చుంటాను. వొక్క మార్కు అంటే ఎంత విలువైనదో మీకు తెలుసుగా'' అనేది రమ నా గుండెల్లో ముల్లు గుచ్చుకునేది.

''మీరు వెళ్ళిన పని ఏది సక్రమంగా జరిగింది కనుక... ఇది జరగలేదని ఏడవడానికి'' శ్రీమతి ఆ రోజు రాత్రి ముక్కు చీదుకుంటూ గోడకేసి పడుకుని సాధిస్తూనే వుంది. కారణం చెప్పాను.

రమ చాలాచాలా కష్టపడి హిందీ పరీక్షలో ప్రవీణ ప్యాసయింది. పురపాలక సంఘం వారి స్కూల్లో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టింది. నేనేమో కాళ్ళకి చాకిరీసులు కట్టుకుని అందరి చుట్టూ తిరిగేను. అప్పుచేసి అంతో యింతో ముడుపు చెల్లించుకున్నాను. తీరా ఫలితాలు తెలిసిన తర్వాత ''సరిగ్గా లిస్ట్''లో మీ ఆవిడ పేరు వరకూ వచ్చి ఆపేయాల్సొచ్చింది. చివరి క్షణాల్లో ఒక పోస్ట్ తగ్గించారు. ఈసారికి కుదరలేదు. వచ్చేసారి ఒక పోస్టు ముందు మీ కోసం రిజర్వ్ చేయిద్దాం'' నలుగురు నాతో అన్న మాటిది. ఈ సంగతి రమకు వివరిస్తేనే ఆమె నాలుగు ఉపవాసాలు చేసి నన్ను ఎనిమిది ఉపవాసాలు చేయించింది.

'తొలి చూలు మగపిల్లవాడైతే త్వరగా చేతికి ఎక్కొస్తాడు' – నా అంతరాంతరాల్లో కోరిక. అమ్మాయి పుట్టింది. ''స్నేహ – అందాం పేరు'' అన్నాను. ''అక్కర్లే మా అమ్మ పేరెట్టు కుందాం. మంగతాయారు'' రమ ముచ్చట తీరింది.

టైపిస్టు నుంచీ మారి గుమస్తానైనాను.

ప్రమోషన్ లిస్టు వేస్తే – నా పై వాడి పేరుతో ఆగిపోయింది. నాకేమో హైదరాబాద్ బదిలీ అయింది.

పాల బూత్‌కి రమ వెళ్ళకుండా నేవెళ్తే ఆ రోజు పాలు లేనట్టే! నా వంతు వచ్చేసరికీ 'కేన్' ఖాళీ అయ్యేది.

సాయంత్రం–


''సెంటర్లో వుండు వస్తాను'' అని ఫోన్ చేస్తాడు భాస్కరం. అతను వేరే ఆఫీసులో పన్జేస్తున్నాడు. మా వూరి వాడు, మిత్రుడు.

నేను ఐదున్నర నుంచీ ఏడున్నర దాకా ప్రొఫెసర్ ఫోజులో గాలితో ఊసు లాడుకుంటూ నిలబడతాను. కళ్ళు విచ్చుకుపోతయ్. కాళ్ళు ఘనీభవిస్తాయ్. అతను రాడు. ఇది ఎప్పుడో ఓసారి మాత్రమే జరిగేది కాదు.

ఏటికో కోటికో వో సారి – సినిమాకు పోతే క్లయిమాక్సులో రమకు తలనొప్పి వస్తుంది. ''నే కూర్చోలేను బాబూ – వెళ్దాం పదండి'' అంటుంది. అని వూరుకోదు. కుర్చీలోంచి లేచి బయటకి దారి తీసేస్తుంది. నేను మ్యూజిక్‌ను అనుస రించే పాటలా, ఆమెతో నడుస్తాను. నాకు ''డిష్యుం... డిష్యుం... అంటే తగని యిష్టం. సినిమాలో అఫైట్స్ చూసేదంతా అదే మరి.''

మరదళ్ళ పెళ్ళిళ్ళకు చాలావాటికి వెళ్ళాం రమా నేనూ కలిసి. తలంబ్రాల సమయ మంటే చాలా ఉత్సాహం నాకు. పెళ్ళి కొడుకు పక్కనచేరి అతన్ని ప్రోత్స హిస్తూ, పెళ్ళి కూతురిని ఉడికించాలని మహాసరదా పడతాను. ఈ ముచ్చటా తీరదు. సరిగ్గా ఆ సమయానికి ఏ మాంవగారో పిలుస్తారు. అర్జంటుగా ఎక్కడికో వెళ్ళి రావాలి. లేక వంటింట్లోనో, పందిట్లోనో పని బడుతుంది. తిరిగి వచ్చేసరికి ఆ ఘట్టం అయిపో తుంది. తాయా రుకి పుట్టు వెంట్రుకలు తిరుపతిలో చేయాలని మొక్కుకుంది రమ. ముందుగా నా పర్మిషనేవీ తీసుకోలేదు. అది తన జన్మహక్కు అని ఆమె భావన. తిరుపతి ప్రయాణమైనాం. అడుగడు గునా 'తరుగు' నాకంటే ముందుగా తయార్రై రైలు టిక్కెట్లకు రిజర్వేషన్ కోటా అయిపోయింది. తర్వాత రోజు వెళ్దాంలే అంటే – 'అమ్మో మంచి ముహూర్తం పోతుంది' అని సతీమణి భయందోళనల్ని ప్రక టించింది.

కొండమీదికి చేరేసరికి కాటేజీలకూ క్యూ, సత్రం గదులకూ క్యూ, క్యూకూ నా తరుగుకూ ఎప్పుడూ ఒకటే అవినాభావ సంబంధం. అవస్థల్ని అన్నింటినీ 'గోవింద... గోవిందా' అనుకుంటూ అధిగమించి ధర్మదర్శనంలో నిలబడితే ఆరు గంటల తర్వాత గర్భగుడికి ఆరు గజాల ఇవతలికి చేరేం. 'అమ్మయ్య దగ్గర పడ్డాం' అనుకుంటూ, కళ్ళు చేటంత చేసుకుని ఊపిరి పీల్చుకుంది రమ. పిల్ల దాని ప్రాణం కళ్ళలో వుంది. నా జీవశక్తి చీకటి కోణంలో మిణుకుమిణుకు మంటోంది. ఆ రోజుకు ధర్మ దర్శనం 'టైమయిపోయింది'.



పెద్ద మామయ్యకు ఆరోగ్యం బాగా లేదు. హాస్పటల్లో చేర్చారు. రమ కళ్ళల్లో నీళ్ళు. మనస్సు పరిపరి విధాలా పోయింది.

ఆఫీసుకు పోయి మేనేజరు ముందు సెలవు కావాలని నస గటం ప్రారంభించాను. నా సెలవుచీటిని పక్కనపెట్టి, డ్రాయరు సొరుగు లాగి టెలిగ్రాం కాగితం తీసి నా ముందుంచాడు. మర్నాటి నుంచీ ''స్పెషల్ ఆడిట్''.

రమ తాయారుని తీసుకుని బందరు వెళ్ళిపోయింది.

మే 16న వైరిచ్చింది రమ – మామయ్యకు సీరియస్‌గా వుంది వెంటనే రమ్మని.

మే 17 ఉదయానికి అతి కష్టం మీద విజయవాడ చేరాను. ఉదయ సంధ్యలో కూడా నిప్పులు చెరుగుతోంది వేసవి.

దేశంలో వున్న కన్నెపిల్లల్లో సగం మంది పెళ్ళిళ్ళు ఆరోజే జరుగుతున్నా యని – వో భయంకరమైన వార్త! బస్‌స్టాండ్ అంతా అట్టుడికి పోతున్నది.

బస్‌ల కోసం ఆరు గంటలూ, ఎనిమిది గంటలూ, పన్నెండు గంటలూ పడిగాపులు పడుతున్నారట జనం, కథలూ, గాథలూ కావు – వ్యథలూ. చేదు అనుభవాలూ!

బందరుకు అర గంటకు ఒకటి చొప్పున వెళ్ళాల్సిన బస్ గంటకొకటిగా అతి కష్టం మీద వస్తోంది. బుకింగ్‌కౌంటర్ దగ్గర నిలబడితే ''బస్‌లో ఎక్కేయండి – అక్కడే టిక్కెట్లిస్తారు'' అని ప్రకటన. అప్పటికి ఆ బస్ లోపల నూటపది మంది, బయట ఆరు వేల మంది అన్నట్టు రద్దీ. తర్వాత బస్‌కి బస్ దగ్గరే నిలబడితే – వచ్చిన బస్‌డోర్ దగ్గర కంట్రోలు. ''టిక్కెట్టున్న వాళ్ళనే బస్‌లోకి రానిచ్చేది'' అని హెచ్చరిక.

ఎవరో కలియుగ భీమసేనుడు మే 17వ తేదీ రాత్రి పన్నెండున్నర గంటల బస్‌లోకి నన్ను గెంటేశాడు.

బందరు చేరే సరికి మామయ్య లేడు. అంతా అయిపోయింది.

రమ చూసిన చూపుకి నా గుండెని కోసి కుప్పపోసినా సరైన సమాధానం కాదని అర్థమైంది.

ఇరవైఏళ్ళు తండ్రిలా పెంచిన మామయ్య కడసారి చూపుకు నోచుకోలేదని నా అంతఃకరణ గీ పెట్టుంటే; బంధుమిత్రుల సూటి, పోటీ మాటలు నా మనస్సును రంపపు కోత కోసేయి.

నా దురవస్థని నమ్మిన సత్యం ''నువ్వు వట్టి పూల్‌విలే పోరా'' అన్నాడు.

''నువ్వు ఎక్కవలసిన రైలు ఎప్పుడూ ఒక జీవిత కాలం లేటు'' అన్న కవి వాక్కు నీ పట్ల అక్షరాలా అన్వయిస్తుందిలే'' అన్నాడు రాజు.

***


నెలలు సంవత్సరాలుగా మారుతున్నై.

తాయారు తర్వాత 'సుబ్బలక్ష్మి', జ్ఞానప్రసూనాంబా, సుశీలా మా కుటుంబంలోకి కొత్త సభ్యులుగా ప్రవేశించారు.

ఎక్కడికక్కడ ఎక్కవలసిన బస్‌లు మిస్ అవుతూ గడియారంలో ముళ్ళని కదుల్చు కొస్తున్నాన్నేను.

అరడుగు ముందుకు జరిపి, ఆరడుగులు వెనక్కి లాగుతూనే వుంది జీవితం.

అడుగులోనే హంసపాదు పడిన తర్వాత – ఉద్యోగం చేయాలనే కోరికకి ఉద్వాసన చెప్పేసింది రమ. చెప్పుకుంటే సిగ్గు చేటుగా పరిణమించినై.



## జీవితం సరళరేఖా కాదు, వక్ర రేఖా కాదు



జీవితం ఏ రూల్స్‌లోనూ ఒదగదు. ఏ రూళ్ల కర్రకీ లొంగదు. అది ఎప్పుడూ అంతా సరళ రేఖా కాదు,అంతా వక్ర రేఖా కాదు. మనిషి ఈ సత్యాన్ని తెలుసుకుంటే నిరాశతో కుంగిపోకుండా తన జీవితాన్ని సుఖమయం చేసుకోగలడు. ఈ భావాన్ని సూచించే కథానిక 'స్పృహ'.

– విహారి
(జె.ఎస్.మూర్తి)
16-11-310/12/ఎ/1/1,
సలీం నగర్ కాలనీ-2
మలక్‌పేట్, హైదరాబాద్-36
సెల్ : 9848025600

హైదరాబాద్ నుంచీ విశాఖకు బదిలీ వచ్చింది.

రెక్కలమ్ముకున్న వాడిని. ఇబ్బందులన్నీ నాలో లోపల ''జీర్ణం జీర్ణం – వాతాపి జీర్ణం'' కావలసిందే!

ఈ వానపాము విశాఖలో దేకటం ప్రారంభించింది.

రెడ్డిగారితో పరిచయమైంది. పరిచయం చదువుగా మారింది. చదువు హృదయ సాన్నిహిత్యాన్ని పెంచింది.

అయినా, ఆయన్ని నేను ''గురువుగారూ'' అనేవాణ్ణి. ఆయన నన్ను ఏకవచనం లోనే సంబోధించేవాడు. వయస్సులో పెద్దవాడు. ఏభై దాటింది ఆయనకు. మా సెక్షన్‌కి హెడ్ క్లర్క్.

ఆ రోజు....

పదిహేనేళ్ళ సర్వీసులో ఆరోసారి ప్రమోషన్ తప్పిపోయింది. నా అంతరాంతరాల్లో న్యూనతభావం, పదిమందిలో నా చవటదనం పదేపదే వ్యక్తమవుతోందనే ఆవేదనల సెగ – రగులుకున్నై, సహోద్యోగులంతా సానుభూతి చినుకుల్ని వర్షించసాగేరు. పెదవులు మాత్రం ''ఇట్సాల్ రైట్'' అంటున్నై గానీ, నా మనసు ఏడుస్తూనే వుంది.

లంచ్‌టైమ్ తర్వాత వో అరగంటకి నా దగ్గరకి వచ్చేరు రెడ్డిగారు. ''ఈ పూట సెలవు పెట్టాను విశ్వం, నువ్వూ రా పోదాం'' అన్నారు.

రెడ్డిగారి స్కూటర్ సినిమాహాలు కొచ్చి ఆగింది. టిక్కెట్లు తీశారు. ''గ్రేట్ ఎస్కేప్'' సినిమా. అప్పటికే మొదలైంది.

జనం పల్చగా వున్నారు. పై వరుసలన్నీ ఖాళీగా వున్నై. మొదటి వరుసలో వో మూలకి నడిచాం.

సీట్లల్లో కూర్చున్న తర్వాత అడిగేరు – ''మీ వాళ్ళు లేరన్నావు కదూ''.

''అవును, ఇవ్వాళే వస్తారు. రాత్రి ఎనిమిది గంటల రైల్లో''.

''అయితే సినిమా కాగానే మా ఇంటికిపోదాం. అక్కణ్నుంచీ నిన్ను స్టేషన్‌లో దించుతాను. నువ్వెప్పుడూ మా యింటికి రాలేదు కూడా....''

నేనేం మాట్లాడలేదు.

క్షణాల తర్వాత రెడ్డిగారే యథాలాపంగా అన్నారు. ''నా గురించి నీతో చెప్పాలని చాలాసార్లు అనుకున్నాను. కానీ వీలు కాలేదు''

నేను ఆయన కేసి చూశాను. ఆకాశ చిత్రాల్ని చూస్తున్న చిన్నపిల్లవాడిలా ఆయన హాలు సీలింగ్ కేసి చూస్తున్నారు.

ఆయన చెప్పటం మొదలెట్టారు.

''నోట్లో వెండి చెంచాతో పుట్టినవాణ్ణి నేను. నా అయిదో ఏటో ఓ గది నిండా నా ఆట వస్తువులు, నాలుగు సూట్‌కేస్‌ల్లో నా బట్టలూ వుండేవిట. నన్ను బళ్ళో వేసిన రోజున మా వాళ్ళు బ్యాండ్ మేళంతో కార్లో వూరేగించి స్కూల్లో పిల్లకి తలకొక రూపాయి, పలకా, బలపం, లడ్డూ, బూందీ పంచేరట, అయ్యవార్లందరికీ పట్టు పంచెలూ, మా యింట్లో విందూ దక్కినాయట. మా నాన్న – కలప వ్యాపారం చేసేవాడు.''

ఆగేరు. ''శత్రువులకి పట్టుబడ్డా ఆ జనరల్ దర్పం చూశావా?'' అని తెర వైపు చూస్తూ అన్నారు. మళ్ళీ చెప్పసాగేరు.

''నేను పధ్నాలుగో ఏట నుంచీ రాజమండ్రిలో వారాలు చేసుకుని చదువుకున్నాను. ఆ మధ్య జరిగిందంతా చెప్పక్కర్లేదు. అదో సినిమా... అంతే''.

''ఎస్సెల్సీ పాసైనాను. ఆ తర్వాత మద్రాసులో ఒక కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకు పదహారు రూపాయల జీతం. పెళ్ళీ, పేరంటాలైనాయి. ఒక అమ్మాయీ, ఒక అబ్బాయీ పుట్టేరు. అప్పుడు మా ఆఫీసు నాలుగంతస్థుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో వుండేది. ఒకరోజు మధ్యాహ్నం రెండింటికి ఆ భవనం మొత్తం ఉన్నట్టుండి మొత్తం కూలిపోయింది. మేజర్ యాక్సిడెంట్, వందల సంఖ్యలో జనం చచ్చిపోయారు. నేను ఎనభై నాలుగురోజులు హాస్పటల్‌లో వున్నాను. శరీరంలో చాలా ఎముకలు గన్నేరు కొమ్మల్లా విరిగిపోతే అతుకుపెట్టారట''.

నాకు ప్రాణం ఉగ్గపట్టినిట్లైంది. గుండెలు చిక్కబట్టినై. ఆశ్చర్యంతో – దయ్యాన్ని చూస్తున్నట్టు, సమాధినుంచీ లేచి హుందాగా నడిచి వచ్చిన శవాన్ని చూస్తున్నట్టూ ఆయన కేసి చూశాను.

ఆయన సన్నగా నవ్వేరు. ''మరో రెండేళ్ళకి గౌహతికి మార్చారు నన్ను. ఆ కంపెనీకి వొక బ్రాంచి అక్కడుంది. అక్కడ నాలుగేళ్ళు ఉన్నతర్వాత, పేపర్లో ప్రకటన చూసి ఈ కంపెనీలో ఉద్యోగానికి దరఖాస్తు చేశాను. వచ్చింది. ఇందులో వేరే అవతారం ఎత్తాను''.

సినిమా అయిపోయింది. ఏం జరిగిందో ఇద్దరమూ చూడలేదు. బయటికొచ్చాం.

రెడ్డిగారి ఇల్లు చేరేము. ముందుగదిలో నన్ను కూర్చోబెట్టి ఆయన లోపలికి వెళ్ళేడు, కొంచెంసేపటికి బయటికొచ్చి, ''రా.... ఇల్లు చూద్దువుగాని....'' అని లోపలికి ఆహ్వానించారు. ఆయన్ని అనుసరించాను. వొక గదిని చూపి – ''మా శ్రీమతి'' అన్నారు. ఆమె మంచంలో పడుకుని వుంది. ''ఒంట్లో బాగా లేదా'' అడిగేను. అదోలా నవ్వేరు తర్వాత చెప్పేరు. ''ఆమెకి ఐదేళ్ళక్రితం పక్షవాతం వచ్చింది'' విస్తుపోయాను. మౌనంగా అడుగులు వేస్తున్నాను. మరో గదిలోకి చూపుతూ, ''మా అబ్బాయి ప్రభు'' అన్నారు. అతను చేతులెత్తి నమస్కరించాడు. ఇవతలికి వచ్చిన తర్వాత చెప్పారు. ''వాడికి నోరూ లేదు. కాళ్ళూ లేవు''.

నా మనస్సంతా కలిచినట్లయింది. గబగబా నడిచి ముందు గదిలోకి వచ్చేను, నా తల దిమ్మెక్కింది.

కాఫీ కప్పులతో వచ్చారు రెడ్డిగారు. తీసుకున్నాను.

కాఫీ సిప్‌చేస్తూ చెప్పేరు. ''మా అమ్మాయిని పుట్టింటికి రానీరు అత్తగారు. దానికిద్దరు పిల్లలట...'' మా ఆవిడ పాతచుట్టం వో ముసలమ్మ వండి పెట్టుంది. ఈ యింట్లో వున్న వొకే వొక్క మనిషి ఆవిడే. మిగిలినవన్నీ జీవచ్ఛవాలు''.

***

రమా వాళ్ళని రిసీవ్ చేసుకోడానికి రైల్వేస్టేషన్‌కి వెళ్ళాం. స్టేషనంతా కోలాహలంగా వుంది. అట్టుడికినట్లు ఉడికిపోతోంది వార్త. ఆ రైలుకి ప్రమాదం జరిగింది. చాలామందికి గాయాలు తగిలాయి. కొందరు మరణించారు.

నాకు కాలూ చెయ్యీ ఆడలేదు. రెడ్డిగారు ధైర్యం చెప్తున్నారు. పోస్టాఫీస్‌కి వెళ్ళి మా వూరికి టెలిగ్రాం ఇచ్చాం.

బరువెక్కిన గుండెతో, భయాందోళనలతో ఇంటికి వచ్చాం. ఇంటి వాళ్ళబ్బాయి గుమ్మంలోనే ఎదురై టెలిగ్రాం అందించాడు. ''రేపు వస్తున్నాం ఈ రోజు రైలు తప్పిపోయింది–'' రమ.

''తరుగులో మెరుగు అంటే ఇదే –'' వేరే సందర్భంలో సత్యం అన్నమాట గుర్తుకొచ్చింది.


''జీవితం నీకు ఎప్పుడు ఏది యిస్తుందో దాన్ని స్వీకరించు. అది రాలేదని బాధపడీ, ఇది కావాలని ఆరాటపడీ మనంగా సాధించగలిగేది చాలా స్వల్పం. కాదంటావా?'' రెడ్డి గారు ప్రశ్నిస్తున్నారు.

కూలిపోతున్న నాలుగు అంతస్తుల భవనం, విరిగి పోతున్న గన్నేరు కొమ్మలే – నా కళ్ళ ముందు మొదలుతున్నై.

నాలో నేను పెరిగిపోయి రెడ్డిగారికేసి చూసేను. మహాపర్వతం దిగువన గులకరాయిలా వున్నాన్నేను.

★


అతని కల సినిమా
అతని బతుకు సినిమా
అతని ఊపిరి సినిమా
సినిమా తప్ప మరో జీవితం అతనికి లేదుగాక లేదు.



వెండితెర వరప్రసాదం
(ఎల్వీప్రసాద్ జీవితప్రస్థానం)

త్వరలో ప్రారంభం